క్లుప్తంగా

గ్రామాల్లో హోం ఓటింగ్



మహబూబాబాద్ రూరల్: మండలంలోని ముడుపుగల్, ఆమనగల్, జంగిలిగొండ, సింగారం గ్రామాల్లో ఆదివారం హోం ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల అధికారి కూరపాటి శంకర్, సిబ్బంది ఆయా గ్రామాల్లోని దివ్యాంగులు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి ఓటు వేయించారు.
డోర్నకల్: మండలంలో ఆదివారం నిర్వహించిన హోం ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. మూడు బృందాల ఎన్నికల సిబ్బంది డోర్నకల్‌తోపాటు పలు గ్రామాల్లో పర్యటించి దరఖాస్తు చేసుకున్న 50 మంది ఇళ్లకు వెళ్లి ఓటు వేయించారు.
కురవి: వృద్ధులు, దివ్యాంగులకు కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంటు ఎన్నికల్లో ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడంతో ఆదివారం మండల కేంద్రంలో వృద్ధులు ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కేసముద్రం: మండలంలోని కాట్రపల్లి, కేసముద్రం విలేజ్ శివారు ఎన్టీఆర్ నగర్‌లోని గుడుంబా స్థావరాలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. రెండు చోట్ల 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు.

అక్రమంగా ఇసుక డంపులు

నెల్లికుదురు: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో అక్రమంగా ఇసుక డంపులు చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేసి రహస్య ప్రదేశాల్లో నిల్వ చేస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలం కేంద్రంలోని ఆకేరు వాగులోంచి పగలు, రాత్రి జోరుగా వందల ట్రిప్పుల ఇసుకను అక్రమగా తరలిస్తున్నారు. అక్రమ ఇసుక దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికలకు ప్రజలు సహకరించాలి



కొత్తగూడ: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు సహకరించాలని మహబూబాబాద్ ఎస్‌డీపీఓ తిరుపతిరావు సూచించారు. మండలంలోని కొత్తపల్లి, పొగుళ్లపల్లి, మొండ్రాయిగూడెం, గుండంపల్లి, వేలుబెల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ఆయన వెంట గూడూరు సీఐ బాబురావు, ఎస్సై దిలిప్ ఉన్నారు.

జోరుగా సాగుతున్న ఎన్నికల ప్రచారం

డోర్నకల్: డోర్నకల్‌తోపాటు పలు గ్రామాల్లో ఆదివారం పార్లమెంటు ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. తీవ్రమైన ఎండలు ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ తమ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.

తల్లిని చూడడానికి వెళ్తూ..

రైలునుంచి జారిపడి
ఉత్తరప్రదేశ్ వాసి మృతి

మహబూబాబాద్ రూరల్: రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుందని జీఆర్పీ ఎస్సై సురేష్ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫతేపూర్ జిల్లాకు చెందిన శివ అనే వలస కూలీ కావలిలో ఉంటూ తల్లికి ఆరోగ్యం బాగోలేక వైద్యశాలలో ఉండగా తల్లిని చూడడానికి ఉత్తర ప్రదేశ్ రైలులో వెళ్తున్నాడు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ దాటిన తర్వాత రాత్రి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడి వద్ద ఉన్న సెల్ ఫోన్ ఆధారంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫతేపూర్ జిల్లా వాసి శివగా గుర్తించి తండ్రి సంజీవ్ కుమార్‌కి సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని తరలించడం కోసం రైల్వే పోలీస్ ఖమ్మం నగరానికి చెందిన అన్నం సేవా ట్రస్టుకు సమాచారం ఇవ్వగా అన్నం సేవా ట్రస్ట్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతోపాటు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పోలీసుల సమక్షంలో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల పోస్ట్ మార్టం గదికి తరలించారు.

ఇంటింటికీ ఓటరు స్లిప్పుల పంపిణీ

- పోలింగ్ శాతం పెంచేందుకు అధికారుల చర్యలు
- ఓటర్లకు అందజేస్తున్న బీఎల్‌ఓలు

పెద్దవంగర: పార్లమెంటు ఎన్నికలు మరో ఎనమిది రోజుల్లో జరుగనున్నాయి. ఈనేపథ్యంలో పోలింగ్ శాతం పెంచడంతోపాటు ఎన్నికల నిర్వహణకు సజావుగా సాగేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా వందశాతం పోలింగ్ దిశగా ప్రయత్నాలు చేపట్టారు. ఈనెల 13న పోలింగ్ సందర్భంగా ఎన్నికల అధికారులు తమ విధుల్లో బిజీగా ఉన్నారు. ఈక్రమంలో వారం రోజుల క్రితం నుంచే బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు పోల్ స్లిప్పులు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారుగా 90శాతం పంపిణీ పూర్తి అయ్యింది. మిగిలిన పోలింగ్ స్లిప్పులను సైతం ప్రతి ఓటరుకు అందజేస్తామని పేర్కొంటున్నారు.

పెద్దవంగర మండలంలో 20గ్రామ పంచాయతీలల్లో మొత్తం 31పోలింగ్ కేంద్రాలకు గాను 25,160 మంది ఓటర్లు ఉన్నారు. కారోబార్లు, అంగన్‌వాడీ టీచర్లు కొందరు బీఎల్‌ఓలుగా విధులు నిర్వర్తిసున్నారు. గతంలో పోలింగ్‌కు ముందురోజు రాజకీయ పార్టీల నాయకులు తమ గుర్తులతో పంపిణీ చేయడంతో ఓటర్ల అర్థం కాక ఇబ్బందులు పడేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నికల సంఘం పోల్ స్లిప్పుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇందులో ఓటర్ల సమాచారంతోపాటు పోలింగ్ తేదీ, క్యూఆర్ కోడ్, పోలింగ్ సమయం, పోలింగ్ కేంద్రం సంఖ్య, చిట్టీ వెనకాల పోలింగ్ కేంద్రం మ్యాప్ ముద్రించి ఉంది. దీంతో ఎన్నిక రోజున ఓటర్లు చిరునామా కోసం ఇబ్బందులు పడకుండా నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లేలా మ్యాప్ ముద్రించారు. బీఎల్‌ఓల పేరు ఫోన్ నంబర్ సైతం ముద్రించారు. ఏదైన ఒక గుర్తింపు కార్డుతోపాటు పోలింగ్ స్లిప్పులను తీసుకెళ్లాలి. పోలింగ్ రోజున పాటించాల్సి నిబంధనలు పొందు పరిచారని అధికారులు పేర్కొన్నారు.



ఓటర్ స్లిప్పు పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

పోలింగ్ శాతం పెంపునకు చర్యలు



వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంపునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే 90 శాతం పోలింగ్ స్లిప్పులను బీఎల్‌ఓల ద్వారా పంపిణీ చేయించాం. ఈనెల 8వ తారీకు వరకు ప్రతి ఒక్కరికి అందజేస్తాం. అందని వారు పోలింగ్ రోజున కేంద్రాల వద్ద బీఎల్‌ఓలను సంప్రదించాలి.
– మహేందర్, ఏఈఆర్‌ఓ, పెద్దవంగర

ప్రశ్నించే గొంతుకను పార్లమెంట్‌కు పంపండి



ఓటు అభ్యర్థిస్తున్న దయాకర్‌రావు, తదితరులు

పెద్దవంగర: వరంగల్ అభివృద్ధి కోసం ప్రశ్నించే గొంతుకను పార్లమెంట్‌కు పంపాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు అవుతాపురం, పోచంపల్లి, గంట్లకుంట, కొరిపల్లి, వడ్డెకొత్తపల్లి, చిన్నవంగర, చిట్యాల, బొమ్మకల్లు గ్రామాల్లో విస్తృత పర్యటన చేశారు. ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులతో సమావేశం చేపట్టారు. అనంతరం బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ గెలుపు కోరుతూ ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారితో కలసి ప్రసంగించారు. గత పది ఏళ్లలో అభివృద్ధి అంటే ఏమిటో బీఆర్ఎస్ చేసి చూపించిందన్నారు. గ్యారంటీ పథకాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, రామచంద్రయ్య శర్మ, పాలకుర్తి యాదగిరిరావు, సుదగాని మనోహర్, పటేల్ నాయక్, సమ్మయ్య, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు



అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపిన కుంట

గార్ల: మండలంలోని గోపాలపురం పంచాయతీ వేదనాయకపురం గ్రామంలోని మిషన్‌కుంటలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి కుంటను ధ్వంసం చేస్తున్న రోడ్డు కాంట్రాక్టర్‌పై అధికారులు చర్య తీసుకోవాలని న్యూడెమోక్రసీ మండల నాయకుడు నాదేండ్ల శ్రీనివాస్, విశ్వనాథం, రాందాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నబంజర నుంచి గార్లకు బీటీ డబుల్ రోడ్డు మంజూరైందన్నారు. ఇట్టి రోడ్డు నిర్మాణ పనులకు సదరు కాంట్రాక్టర్ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మిషన్‌కుంటలోని మట్టిని 5మీటర్ల లోతు కందకాలు పెట్టి యథేచ్ఛగా లారీల ద్వారా తోలుకుంటూ కుంటను ధ్వంసం చేస్తున్నాడని ఆరోపించారు. రైతులు నిర్మించుకున్న కుంటలో అక్రమ పద్ధతిలో లోతుగా గుంటలు చేసిన స్థానంలో మొరం పోసి పూడ్చాలని వారు డిమాండ్ చేశారు. అక్రమంగా మట్టి తోలకాలు చేపడుతున్న కాంట్రాక్టర్‌పై సంబంధిత అధికారులు చర్య తీసుకోవాలన్నారు.

మాలోత్ కవితను గెలిపించాలి



బయ్యారం: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ



మరిపెడ రూరల్: అజ్మీరతండాలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు శారద

బయ్యారం: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న మాలోత్ కవితను గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. ఆదివారం కొత్తపేట, గంధంపల్లి, జగ్గుతండా, బయ్యారం, బంజరతండా తదితర గ్రామాల్లో వారు ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటు వేస్తే ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మాలోత్ కవితను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గణేష్, సొసైటీ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, నాయకులు శ్రీకాంత్, ఐలయ్య, శ్రీను, వెంకన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.
నర్సింహులపేట: మాలోత్ కవితను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆదివారం మండలంలోని జయపురం, కొమ్ముల‌వంచ, పడమటి గూడెం, రామన్నగూడెం, ముంగిమడుగు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కాంగెస్ హామీల అమలులో విఫలం అయిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవేందర్, వైస్ ఎంపీపీ దేవేందర్, నాయకులు మధుసూధన్‌రెడ్డి, జగదీశ్వర్, నాగన్న, వెంకన్న, శంకర్, సత్తిరెడ్డి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.
మరిపెడ రూరల్: బీఆర్ఎస్ పార్టీ గులాబీ జెండా పేదలకు అండగా ఉంటుందని జెడ్పీటీసీ సభ్యురాలు తేజావత్ శారదరవీందర్‌నాయక్ అన్నారు. మండలంలోని అజ్మీతరతండా గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి కూలీలను కలిసి కవితను గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు తేజావత్ రవీందర్‌నాయక్, బానోతు శ్రీనివాస్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మానుకోటకు తరలిన సీపీఎం శ్రేణులు

కురవి: మానుకోట పార్లమెంటరీ స్థాయి సమావేశానికి హాజరయ్యేందుకు మండల కేంద్రం నుంచి ఆదివారం సీపీఎం నాయకులు కురవి నుంచి ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా నల్లపు సుధాకర్ మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గంధసిరి శ్రీనివాస్, కట్ల కృష్ణయ్య, గంధసిరి జ్యోతిబసు, వీరేందర్, బాబు పాల్గొన్నారు.
గార్ల: సీపీఎం ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో నిర్వహించిన పోరిక బలరాంనాయక్ ప్రచార సభకు ఆదివారం గార్ల మండలం నుంచి సీపీఎం శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు, హరినాయక్, గోవింద్, పెద్దవెంకటేశ్వర్లు, ఈశ్వర్ లింగం, నాగమణి, సత్యవతి, ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

కేంద్రంలో ప్రభుత్వ మార్పు తప్పదు

నర్సంపేట: కులగణన చేయకుండా ఓబీసీలను అవమానించిన నేపథ్యంలో కేంద్రంలో ప్రభుత్వ మార్పు తప్పదని ప్రజాసంఘాల జేఏసీ వైస్ చైర్మన్, పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లేశ్వర్ అన్నారు. 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం, సామాజిక న్యాయాన్ని సాధించుకుందాం, కేంద్రంలో మార్పు కోసం ఓటేద్దాం' కరపత్రాలను పట్టణంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లేశ్వర్ మాట్లాడారు. కులగణన చేయకపోవడం వల్లే సామాజిక రాజకీయాల్లో అట్టడుగు వర్గాలు రాణించలేకపోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. కార్యక్రమంలో ఎల్లయ్య, సతీశ్ కుమార్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

బలరాంనాయక్ గెలుపు కోసం ప్రచారం



మహబూబాబాద్ అర్బన్: గాంధీపురంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మహబూబాబాద్ రూరల్: ప్రచారం చేస్తున్న గుగులోతు వెంకట్ నాయక్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు సుందరయ్య నగర్ తండాలో టీపీసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ సంపంగి రామచంద్రు, మహబూబాబాద్ పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తేజావత్ శంకర్ నాయక్, పల్లి దుర్గేష్, కుమ్మరి మహేష్ పాల్గొన్నారు.
మహబూబాబాద్ అర్బన్: ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్‌ను గెలిపించాలని నాలుగో వార్డు గాంధీపురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావిశెట్టి శేఖర్ ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, బాషాసింగ్, సైఫన్, ఉపేందర్, అనిల్, మహేష్ పాల్గొన్నారు.
కురవి: మానుకోట ఎంపీ ఎన్నికల్లో బలరాంనాయక్‌ను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కామిండ్ల వీరన్న, మిర్యాల లక్ష్మయ్య పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించడంతో ఆదివారం వారి ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌నాయక్, చిన్నం గణేష్, బుక్క నాగరాజు, రాజు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు మార్పు అవసరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: రాజ్యాంగ పరిరక్షణ కోసం మార్పు అవసరమేనని, విద్య, ఉద్యోగ రంగాలను విస్మరించిన మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించే రోజులు దగ్గరపడ్డాయని పూలే ఆశయ సాధన సమితి(పాస్) రాష్ట్ర అధ్యక్షుడు సంగని మల్లేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ ప్రధానిగా మోదీ పాలనలో ఆదానీ, అంబానీ, వేదాంత ధనవంతులకే ప్రయోజనాలు జరిగేలా మేలు చేశారన్నారు. నిత్యావసర వస్తువులు, పెట్రో, డీజిల్, గ్యాస్ మీద వేసిన జీఎస్టీ కారణంగా ప్రజల ఆర్థిక స్థితిగతులు విధ్వంసం అయ్యాయన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో బడుగుల కులగణన కోసం తీర్మానం చేసినందుకు కాంగ్రెస్‌కు జై కొట్టాలన్నారు. ఈ సమావేశంలో పాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గట్టి ఎల్లయ్య, నాయకులు సతీష్‌కుమార్, శ్రీనివాసరావు, సుధాకర్, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 7న గోదావరిఖని ఆర్ఆర్ గార్డెన్స్‌లో జరగనున్న ఆటో కార్మిక హక్కుల సాధన రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ నలమాస సాయి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఈదులపూసల్లి రోడ్డు ఆటో అడ్డ సెంటర్‌లో ఆదివారం ఆటో కార్మిక హక్కుల సాధన మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నలమాస సాయి మాట్లాడుతూ.. ప్రత్యేక ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రూ.8వేలు ఉన్న ఆటో ఇన్సూరెన్స్ రూ.1000 తగ్గించాలన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణంతో ఆత్మహత్యకు పాల్పడిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.25లక్షల నష్టపరిహారం చెల్లించి, ఒక్కరికి ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు వీరభద్రం, ఇంద్రారెడ్డి, కిరణ్, రాజు, సైదులు, శ్రీను పాల్గొన్నారు.

వాహన తనిఖీలతో వసూళ్లు..!

- అడిగినంత ఇవ్వకుంటే భారీ జరిమానా
- రోజుకు సుమారు రూ.3లక్షలు జేబుల్లోకి..
- వాహనదారుల ఇబ్బందులు

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ జిల్లా నుంచి ఖమ్మం, వరంగల్, సూర్యాపేట, ఇల్లెందు, భద్రాచలం, ఏటూరునాగారం, హైదరాబాద్ ప్రాంతాలకు వివిధ వస్తువులను తరలిచేందుకు మానుకోట ప్రధాన 365 హైవే మీదుగా నిత్యం వందలాది లారీలు, ట్రాక్టర్లు, డీసీఎంలు, ఇతర వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. అయితే ఈపరిసరాల్లో చెక్ పోస్టులు లేకపోవడంతో అదనుగా చేసుకొని రవాణా శాఖ అధికారులు హైవే మీదుగా వెళ్తున్న వాహనాలైన లారీలను, డీసీఎం, ట్రాక్టర్లును, టాటా మ్యాజిక్ వాహనాలను ఆపి ముక్కుపిండి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

అడ్డాగా మారిన మానుకోట హైవే..
జిల్లా కేంద్రం మీదుగా ప్రతి రోజు రాత్రి సమయంలో లారీల్లో, డీసీఎం, ట్రాక్టర్లు, ద్వారా వివిధ రకాల సరుకులు, ఇసుక, గ్రానైట్, కూరగాయల, పండ్ల రవాణా జరుగుతుంది. అంతే కాకుండా మినీ బస్సులో, కారుల్లో, ప్రయాణికులు ప్రయాణం చేస్తారు. వాహనాదారులకు సరైన పత్రాలు లేకుంటే లేకుంటే అంతే సంగతి, అధికారులు అడిగినంత ఇవ్వాల్సిందే. లేకుంటే రూ.25వేల నుంచి రూ.30 చెల్లించాల్సిదే.. సరైన పత్రాలు లేవని చెక్ రిపోర్టు రాసి ఆ వాహనాలను ఆర్టీసీ బస్టాండ్‌లో హోంగార్డులతో తరలిస్తారు. ఇలా ప్రతి రోజు రాత్రి 7గంటల నుంచి అర్ధరాత్రి వరకు రవాణా శాఖ అధికారులు సూమారు 50 వాహనాలను తనిఖీ చేస్తారు. రూ.10వేల నుంచి వసూళ్లు చేస్తూ ఒక రోజుకు సుమారు రూ.3లక్షల ఆదాయం ఒక రోజులోనే అక్రమంగా జేబుల్లోకి వెళ్తుందని వాహన డ్రైవర్లు వాపోతున్నారు.

సంక్షిప్త సమాచారం

రోహిత్ కుటుంబానికి న్యాయం చేయాలి



మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి రోహిత్ వేముల కులంపై కాకుండా, వేధింపుల గురిచేసిన దానిపై విచారణ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. రోహిత్ వేముల కేసును పునర్విచారణ చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గుగులోత్ సూర్యప్రకాష్, గంధసిరి జ్యోతిబసు, సింహాద్రి, మురళి, వీరేందర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో వ్యాపించిన మంటలు

కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం శివారులోని పంట పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఆదివారం సాయంత్రం భారీగా వీచిన ఈదురుగాలులకు మంటలు వ్యాపించాయి. పంట చేలకు మంటలు వ్యాపించడంతో రైతులు అప్రమత్తం అయ్యారు.

ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

చిన్నగూడూరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిల్లి వీరన్న, కాంగ్రెస్ నాయకులు గాడిపెల్లి జీవన్, దాసరి శ్రీను, రఫీ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మాలధారులు

కేసముద్రం: మాసిపోయిన దుస్తువులు, వెంట్రుకలు, గడ్డంతో అపరిశుభ్రంగా ఉన్న ఓ యాచకుడిని హనుమాన్ భక్తులు చేరదీసి తగు సపర్యలు చేసి మామూలు మనిషిగా మార్చిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కేసముద్రం రైల్వే స్టేషన్ ప్రాంతంలో కొంతకాలంగా మాసిపోయిన దుస్తులు ధరించిన యాచకుడిని చూసిన స్థానిక హనుమాన్ భక్తులు స్పందించారు. క్షౌరకుడిని పిలిపించి తలనీలాలు, గడ్డం గీయించారు. స్నానం చేయించి కొత్త దుస్తులు వేశారు. యాచకుడి పట్ల మానవత్వాన్ని చాటుకున్న హనుమాన్ భక్తులను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో హనుమాన్ మాలధారులు ధరావత్‌భీమానాయక్, సుధాకర్, లాల్‌సింగ్‌నాయక్, ఇమ్మడి సంజీవ, శ్రీహర్ష, గణేష్, సంజయ్ పాల్గొన్నారు.

పరామర్శ..



మహబూబాబాద్ రూరల్: కేంద్ర మాజీ మంత్రి, మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తల్లి లచ్చిబాయ్ మృతిచెందిన విషయం తెలిసిందే. ఆదివారం కాంగ్రెస్ నాయకుడు పద్మం ప్రవీణ్‌కుమార్ హన్మకొండలోని టీచర్స్ కాలనీలో లచ్చిబాయ్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించాడు. బలరాం నాయక్‌ను పరామర్శించాడు.

మనస్తాపంతో పురుగుల మందు తాగిన మహిళ

గార్ల: అన్నదమ్ముల భూవివాదంలో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణతో మనస్తాపానికి గురై ఓ మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం చిన్నసరిహద్దు తండాలో చోటుచేసుకుంది. ఎస్సై జీనత్‌కుమార్ కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. మండలంలోని చిన్నసరిహద్దుతండాకు చెందిన మాలోత్ శంకర్, మాలోత్ సక్రులు ఇద్దరు అన్నదమ్ములు. వీరి తల్లికి చెందిన భూమిని చిన్నకొడుకు సక్రు అక్రమంగా పట్టా చేసుకున్నాడు. మాకు తెలియకుండా పట్టా ఎలా చేసుకున్నావని పెద్ద కొడుకు మాలోత్ శంకర్ భార్య అచ్చమ్మ ఇట్టి భూమిని ట్రాక్టర్ పెట్టి దున్నిస్తుండగా, సక్రు అతని భార్య వచ్చి వారిని కొట్టారు. దీంతో మనస్తాపానికి గురైన అచ్చమ్మ పురుగుమందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లింది. హుటాహుటిన అచ్చమ్మను ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స జరిపిస్తున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పెద్దకొడుకు శంకర్ ఫిర్యాదు మేరకు సక్రు అతడి భార్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కరాటేతో శారీరక, మానసిక వికాసం

నర్సంపేట: కరాటేతో విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి బాటలు పడతాయని కేఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ నరహరి రాజేందర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కేఎస్ఆర్ కాన్సెప్ట్ స్కూల్ గ్రౌండ్‌లో షూటోకాన్ జపాన్ కరాటే డూ ఇండియా హంబు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బెల్ట్ ఎగ్జామ్‌లో పట్టణానికి చెందిన విద్యార్థులు బేసిక్స్, కటాస్, కుమితే విభాగాల్లో ప్రతిభ కనబర్చి బెల్టులు, సర్టిఫికెట్లు సాధించినట్లు సంస్థ రాష్ట్ర టెక్నికల్ డైరెక్టర్ షిహన్ రచ్చ భవానిచంద్ బ్లాక్ బెల్ట్ 5వ డాన్ తెలిపారు. ఎల్లో బెల్ట్ విభాగంలో కుసుమ మనీష్, సుభాన్, అభిజ్ఞ, విష్ణుతేజ, మధుప్రియ, అభినవ్‌చారి, వరుణ్‌తేజ్, హార్దిక్, అక్షిత్, ఆరెంజ్ బెల్ట్ విభాగంలో మనీష్, భీమ్‌రావు, శ్రీహర్ష, సాత్విక్, మణిదీప్, గ్రీన్ బెల్ట్ విభాగంలో మనీష్, మహేంద్ర, బ్లూ బెల్ట్ విభాగంలో రిషిత్, పర్పుల్ బెల్ట్‌లో గురుచరణ్, బ్లాక్ బెల్ట్ 1వ డాన్‌లో పి.హర్షత్, దొడ్డ జ్ఞాన రితికిలకు సంస్థ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, టెక్నికల్ డైరెక్టర్ క్యోషి రచ్చ శ్రీనుబాబు బ్లాక్ బెల్ట్ 7వ డాన్ జపాన్ డిప్లమా విద్యార్థులకు ఎగ్జామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేందర్‌రెడ్డి పాల్గొని ప్రతిభ చాటిన విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందించి మాట్లాడారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా ఆటల్లో రాణించాలని ఆకాంక్షించారు.

ఆదివాసీల అభ్యున్నతికి పోరాటం చేస్తా..



కొత్తగూడ: తనను గెలిపిస్తే ఆదివాసీల అభ్యున్నతి కోసం పోరాటం చేస్తానని తుడుందెబ్బ మద్దతు తెలిపిన స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆదివాసీల మనుగడకు ఈఎన్నికలు వేదికగా ఐక్యతను చాటాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో గోదావరి నీటిని మైదాన ప్రాంతాలకు తరలిస్తూ ఆదివాసీల భూములకు నీరివ్వకుండా ఆర్థికంగా అణచి వేస్తున్నారన్నారు. రాజ్యాంగంలో ఉన్న ప్రత్యేక చట్టాలు ఆదివాసీలకు రక్షణ కల్పించడం లేదని ఆరోపించారు. ఆయన వెంట నాయకులు పాపారావు, సుభద్ర, మధు, ఉపేందర్ పాల్గొన్నారు.